సాక్షి
జనగామ
శనివారం । 19 । అక్టోబర్ । 2024



ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి.. - 8లో▸

ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన అంతర్‌జిల్లా చైన్ స్నాచర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.



దేశం గర్వపడేలా విజయాలు సాధించాలి - 8లో▸

ప్రపంచ వేదికపై భారతదేశం గర్వపడేలా విజయాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30^0 /22^0

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: ఈ నెల 22న నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రెడిట్ అక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కలెక్టరేట్‌లోని ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలన్నారు. వివరాలకు 7995430401 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి



జఫర్‌గఢ్: హైడ్రా తరహాలో జిల్లాలో కూడా ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో పెండ్యాల సమ్మయ్య అధ్యక్షతన శుక్రవారం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని అన్యాక్రాంతం అయిన భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. పేదల ఇళ్లను కూలగొట్టిన ప్రభుత్వం వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్‌పాష, నాయకులు కూరపాటి చంద్రమౌళి, బుల్లె దూడయ్య, మంద బుచ్చయ్య, రడపాక సత్తయ్య, ఎండీ జాఫర్, వెంకటయ్య, సాయిలు పాల్గొన్నారు.

మహిళల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు



జనగామ రూరల్: మహిళల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు అనివార్యమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ఐద్వా నాలుగో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళలకు భద్రత లేకుండా పోయిందన్నారు. మహిళల హక్కుల రక్షణకు ఐద్వా కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి షబానా, సహాయ కార్యదర్శి మోకు భవాని, పట్టణ అధ్యక్షురాలు బండ రమాదేవి, కార్యదర్శి పందిళ్ల కల్యాణి, ఎర్ర అనిత, ఎండీ గౌస్య, కొండ వరలక్ష్మి, ఎండీ నాజియా పాల్గొన్నారు.

ఎస్సైని సస్పెండ్ చేయాలని ధర్నా



పాలకుర్తి టౌన్: పోలీసులు గిరిజన యువకుడికి న్యాయం చేయకపోవడంతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని, పోలీసు ఉన్నతాధికారులు న్యాయ విచారణ జరిపి ఎస్సై సాయి ప్రసన్నకుమార్‌ను సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు బాలునాయక్, బానోత్ మహేందర్, లావుడ్యా దేవేందర్, లకావత్ నరహరి, మురహరి, శ్రీనివాస్, కుటుంబ సభ్యులు మాట్లాడుతూ భార్య కాపురానికి రాకపోవడమే కాకుండా దాడి చేసిన అత్తామామలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎస్సై పట్టించుకోకపోవడంతోనే లకావత్ శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. అలాగే అకారణంగా కొట్టిన అత్తామామలపై చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న డీసీపీ రాజమహేంద్రనాయక్ ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. శ్రీనివాస్‌ను అకారణంగా కొట్టిన అత్తమామతో పాటు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కాగా శ్రీనివాస్‌పై దాడి చేసిన గుగులోత్ హుస్సేన్, మంక్తి, భూక్య మహేష్, వినోద్, చిక్కిపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ రాజామహేంద్రనాయక్ తెలిపారు. ఆయన వెంట సీఐ గట్ల మహేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎనీ టైం మద్యం

మందుబాబులకు 24 గంటలు సేవలు

- బార్లు, సిట్టింగ్‌లను తలపిస్తున్న బెల్ట్ షాపులు
- జిల్లాలో 1,500 పైగానే దుకాణాలు
- మద్యానికి బానిసలుగా మైనర్లు...!
- ఎక్సైజ్‌శాఖ తనిఖీలు శూన్యం



జనగామ: జిల్లాలో బెల్ట్ దుకాణాల దందా మూడు పువ్వులు.. ఆరు క్వార్టర్లుగా సాగిపోతుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటల పాటు మందు అమ్మకాలు చేస్తూ అమాయకులను బానిసలుగా మార్చేస్తున్నాయి బెల్ట్ షాపులు. ఒక్కో ఊరిలో రెండు నుంచి ఐదు వరకు వెలసిన అనధికారి మద్యం దుకాణాలతో మైనర్లు, యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాయి. అడ్డదారిలో విక్రయిస్తున్న మద్యం దుకాణాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ... నిద్రమత్తు వీడడం లేదు. ఎక్సైజ్ జిల్లా అధికారి... మూడు నియోజకవర్గాల పరిధిలో సీఐ, ఎస్సైలు, పోలీసులు ఉన్నా... తనిఖీలను గాలికి వదిలేశారు.

జిల్లాలోని 12 మండలాలు.. 283 గ్రామ పంచాయతీల పరిధిలో 15 వందలకు పైగానే బెల్ట్ దుకాణాలు ఉండొచ్చని అంచనా. ఇందులో 5 వందలకు పైగా బార్లు, అనుమతి పొందిన సిట్టింగ్‌లను తలపించే విధంగా ఉంటాయి. జిల్లాలో గత ఐదేళ్లతో పోలిస్తే మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరుగగా.. బెల్ట్ దుకాణాలతో రెట్టింపు పెరుగుదలకు కారణమవుతుంది. మద్యం దుకాణాలు ఉదయం 10 గంటలకు తెరుచుకుని.. రాత్రి 10 గంటల వరకు మూసి వేయాలి. ఊర్లలో అనధికారికంగా వెలసిన బెల్ట్ దుకాణాలు మాత్రం 24 గంటలు ఓపెన్‌గానే ఉంటాయి. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు బార్లా తెరిచే ఉంటుంది. మద్యం ప్రియుల సౌకర్యార్థం బెంచీలు, టేబుల్స్, వాటర్ బాటిల్స్, టేస్టీ కోసం చికెన్, లివర్, మటన్, వెజ్ తదితర వాటిని అందుబాటులో ఉంచుతున్నారు. దొంగచాటున కాకుండా... దర్జాగా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నా.. ఎక్సైజ్ శాఖ మాత్రం ఇంకా ప్రోత్సహించే విధంగా వ్యవహరిస్తోందని స్వచ్ఛంద సంస్థలు, ఆయా గ్రామాల ప్రజలు, పలు రాజకీయ పార్టీలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఉన్న జిల్లా కేంద్రంలోనే 50 కిపైగా బెల్ట్ దుకాణాలు.. 24 గంటల పాటు నడుస్తుండడం గమనార్హం.

కల్తీ మద్యం..?

ఆయా మండలాల పరిధిలోని వైన్స్ దుకాణాల నుంచి బెల్ట్ షాపుల నిర్వాహకులు మద్యం తీసుకు వెళుతుంటారు. కొంతమంది బెల్ట్ నిర్వాహకులు కాసుల కోసం కక్కుర్తి పడుతూ స్పిరిట్ కలిపిన మద్యం అమ్మకాలు చేస్తున్నారని అనేక గ్రామాల్లో మాట్లాడుకుంటున్నారు. ఇది నిజమా అబద్ధమా అనే విషయాన్ని ఎక్సైజ్ శాఖ నిగ్గు తేల్చాల్సి ఉంటుంది.

రోజుకు రూ.70 లక్షలకు పైగానే..!

జిల్లాలోని బెల్ట్ దుకాణాల్లో రోజుకు రూ.70 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. సాధారణ బాటిల్ నుంచి రూ.3వేల బాటిల్ వరకు బెల్ట్ దుకాణంలో అందుబాటులో ఉంటుంది. ఎక్సైజ్ శాఖ చేసే పనిని సివిల్ పోలీసులు చేయాల్సిన పరిస్థితి జిల్లాలో నెలకొంది.

ఎమ్మార్పీకి మించి..

బెల్ట్ దుకాణాల్లో మద్యం బాటిల్స్‌ను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తున్నారు. క్వార్టర్‌పై రూ.20 పైన...ఆఫ్, ఫుల్ బ్రాండ్‌ను బట్టి రూ.50 నుంచి రూ.3 వందల వరకు ఎక్కువగా తీసుకుంటున్నారు. అడపదడపా బెల్ట్ దుకాణాలపై పోలీసు శాఖ తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటున్నారే తప్ప... ఎక్సైజ్ శాఖ మాత్రం కూర్చున్న చోట నుంచి కదలడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

బెల్ట్ దుకాణాలను చూస్తే భయమేస్తోంది..



జిల్లాలో ఊరూరా బెల్ట్ దుకాణాలను చూస్తే భయమేస్తోంది. ఒక్కో ఊరిలో రెండు నుంచి 10 వరకు ఉన్నాయనే విషయం ఆందోళన కలిగిస్తుంది. బెల్ట్ దుకాణాలను నివారించాల్సిన ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా ఒకటో, రెండు బాటిల్స్ అమ్ముకునే వారు. ఇప్పుడు బెంచీలు, టేబుల్స్ వేసి మరీ విక్రయించడం వెనక ఎవరున్నదే ప్రశ్న. ఎక్సైజ్ శాఖ ఇప్పటికైనా కళ్లు తెరిచి, బెల్ట్ దుకాణాలపై కొరఢా ఝులిపిస్తేనే మైనర్లు మద్యానికి బానిసలు కాకుండా నిరోధించవచ్చు.

- ఎండీ సాధిక్ అలీ, ప్రముఖ న్యాయవాది, సామాజిక వేత్త

రానున్న ఒలింపిక్స్‌లో మనమూ ఉండాలి

- స్కూల్ గేమ్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడియం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ: రానున్న 2028లో జరిగే ఒలింపిక్స్‌లో మన భాగస్వామ్యం కూడా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. జిల్లా కేంద్రం ధర్మకంచ మినీ స్టేడియంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే 68వ జిల్లా స్థాయి క్రీడా పోటీలను కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, అడిషనల్ కలెక్టర్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పింకేశ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ ఒలంపిక్ టార్గెట్‌గా క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. జిల్లాలోని క్రీడ ప్రాంగణాలను మరింత అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పీడీ, పీఈటీలపై ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతో పాటు శారీరక వికాసం కోసం క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, అడిషనల్ కలెక్టర్ వాలీబాల్ ఆడుతూ పోటీలను ప్రారంభించి, క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. కాగా రెండు రోజుల పాటు జరిగే గేమ్స్‌లో 72 మంది బాలురు, 72 మంది బాలికలు క్రీడల్లో పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబర్చిన వారిని ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రామ్, జిల్లా విద్యాశాఖ డీసీఈబీ సెక్రటరీ చంద్రభాను, జిల్లా యువజన, క్రీడాధికారి వెంకట్ రెడ్డి, కౌన్సిలర్ మారబోయిన పాండు, శ్రీనివాస్, రామరాజు, పీఈటీలు మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రేమకళ

జనగామ రూరల్: టెన్త్‌లో 10జీపీఏ సాధించాలంటే క్రమశిక్షణ, ప్రణాళికతో చదవాలని డీటీడీఓ ప్రేమకళ అన్నారు. శుక్రవారం పట్టణంలోని చంపక్‌హిల్స్‌లోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీటీడీఓ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వాసు, రతన్‌సింగ్, సరోజన, రాజయ్య, వీరన్న, స్వరూప, సారయ్య, హరిచంద్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తి తీసుకురావాలి



పత్తిని పరిశీలిస్తున్న మార్కెట్ చైర్మన్ శివరాజ్

జనగామ: పత్తి రైతులు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. జిల్లాలోని హరిహర కాటన్, సిరి కాటన్, రామలింగ కాటన్, శివసాయి కాటన్ మిల్లు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలను కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాల మేరకు పాలక మండలి సభ్యులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ శివరాజ్ మాట్లాడుతూ 8 శాతంతో ఉన్న పత్తిని సీసీఐ సెంటర్‌కు తీసుకు వచ్చి, ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలన్నారు. 8 శాతం తేమ ఉన్న పత్తి క్వింటాకు రూ.7,521, 12శాతం వరకు ఒక్కో శాతానికి రూ.75 లెక్కన తగ్గించి ఇస్తారన్నారు. అంతకు మించి తేమ శాతం ఉంటే సీసీఐ సెంటర్లలో కొనుగోలు చేయరన్నారు. సీసీఐ సెంటర్లలో రోజువారీగా జరిగే విక్రయాలు, రద్దీ, తదితర సమాచారాన్ని తెలుసుకునేందుకు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన వాట్సప్ (88972 81111) నంబర్‌కు హాయ్ అని టైప్ చేసి సెండ్ చేస్తే పూర్తి వివరాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, సీసీఐ ప్రతినిధి నర్సిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కుంటలోకి దూసుకెళ్లిన కారు



నీటిలో మునుగుతున్న కారులో ఇద్దరు వ్యక్తులు

జనగామ: డ్రైవింగ్ నేర్చుకుంటూ...ప్రమాదవశాత్తు బతుకమ్మకుంటలోకి ఓ కారు దూసుకెళ్లిన ఘటన శుక్రవారం జనగామ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బతుకమ్మకుంట ఏరియాలోని వైఎస్ఆర్ భవన్‌లో ఓ కంపెనీకి చెందిన ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఇదే సమయంలో కంపెనీకి చెందిన ప్రతినిధి కారును ఇద్దరు వ్యక్తులు బయటకు తీసుకువచ్చారు. ఇందులో ఒకరు డ్రైవింగ్ నేర్చుకునేందుకు కారు స్టార్ట్ చేయగా ఇంకొకరు పక్కనే కూర్చున్నారు. బతుకమ్మకుంట చుట్టూ రెండు రౌండ్లు తిరిగిన తర్వాత కారు అదుపుతప్పి అందరూ చూస్తుండగానే పక్కనే ఉన్న చెరువులోకి దూసుకుపోయింది. ఇదే సమయంలో ఓ మహిళ తన ఇద్దరు చిన్నారులను పక్కకు కూర్చోబెట్టి, బట్టలు ఉతుకుతున్నారు. ఆమె పక్క నుంచే కారు కుంటలోకి వెళ్లడం...బట్టలను అక్కడే వదిలేసి మహిళ ఉరుగులు పరుగులు పెట్టడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. కారు కుంట మధ్యలోకి వెళ్లి... మునిగే క్రమంలో అందులో ఉన్న గోరేమియా, మరో వ్యక్తి (ఇద్దరు వ్యక్తులు) విండో అద్దాలు తీసుకుని కుంటలోకి దూకి ప్రాణాలు కాపాడుకున్నారు. కంపెనీ ప్రతినిధులతో పాటు బతుకమ్మకుంటలో వాకింగ్ చేస్తున్న వాకర్లు వెంటనే స్పందించి అక్కడకువెళ్లి ఆందోళన చెందుతున్న మహిళను ఓదార్చి నీటిలో దూకిన ఇద్దరిని బయటకు తీసుకువచ్చారు. వాకర్లు, కుటుంబంతో సహా సేద తీరేందుకు ఏర్పాటు చేసిన బతుకమ్మకుంటలో డ్రైవింగ్ నేర్చుకోవడం ఏంటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా రాత్రి 7 గంటల ప్రాంతంలో కుంటలో మునిగిన కారును క్రేన్ సాయంతో బయటకు తీశారు.

కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- 32 ఏళ్ల బోధనా అనుభవం





కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ (వీసీ)గా హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత వీసీ రమేశ్ పదవీకాలం ఈఏడాది మే 21తో ముగియగా ఈనెల 16వ తేదీ వరకు ఐఏఎస్ వాకాటి కరుణ ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం విదితమే. రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామానికి చెందిన ప్రతాప్ రెడ్డి ఓయూలో ఎమ్మెస్సీ (1981-1983), పీహెచ్‌డీ (1987-1988) పూర్తిచేశారు. 1989లో ఉస్మానియా యూనివర్సిటీ జు వాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులై అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ఆ తర్వాత ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2006 నుంచి ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రతాప్‌రెడ్డి 32 ఏళ్ల బోధన, 35 ఏళ్ల పరిశోధనా అనుభవం కలిగి ఉన్నారు. న్యూరోసైన్స్‌లో నైపుణ్యం కలిగి పరిశోధనలు చేశారు. ఆయన పర్యవేక్షణలో 29 మంది పరిశోధకులు పీహెచ్‌డీ చేశారు. ప్రతాప్ రెడ్డి.. 12 ప్రధాన పరిశోధన ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు డీబీటీ, డీఎస్‌టీ, సీఎస్ఐఆర్‌హెచ్ మొదలైన వాటి నుంచి జాతీయ, అంతర్జాతీయంగా 80 పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఇంపాక్ట్ ఫ్యాక్టర్‌తో జర్నల్స్ ఫిజియాలజీ, బయోటెక్నాలజీలో 5 పుస్తకాలు రచించారు. ఆయన ఇండియన్ అకాడమీ ఆఫ్ న్యూరోసైన్స్ బహుమతి, యూజీసీ-బీఎస్ఆర్ మిడ్ కెరీర్ అవార్డు గ్రహీత కూడా. 2017లో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్నారు. నేడు కేయూ వీసీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

వర్సిటీ అభివృద్ధికి కృషి

కాకతీయ యూనివర్సిటీ ఇప్పటికే న్యాక్ ఏప్లస్ గ్రేడ్ కలిగి ఉంది. వర్సిటీని అన్నివిధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తా. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేలా చర్యలు తీసుకోవడం, అకడమిక్ పరంగా పలు మార్పులతో ముందుకెళ్తాం. ఉద్యోగ, అధ్యాపకుల సమస్యలు కూడా మా పరిధిలో పరిష్కరిస్తాం. రెగ్యులర్ అధ్యాపకుల కొరత అన్ని వర్సిటీల్లోనూ ఉంది. వీరి నియామకానికి ప్రభుత్వం సుముఖంగానే ఉంది. అధ్యాపకుల నియామకాలు జరిగే అవకాశాలున్నాయి.

- ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి, వీసీ

అకడమిక్, అడ్మినిస్ట్రేషన్ అనుభవం..

ప్రతాప్‌రెడ్డి ఓయూలో 2013-2014 సంవత్సరం రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ఆడిట్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ఎడ్‌సెట్ కన్వీనర్, జాతీయ సేవాపథకం ప్రోగ్రాం ఆఫీసర్, వార్డెన్, స్టూడెంట్స్ అడ్వైజర్ బాధ్యతలు నిర్వర్తించారు. జువాలజీ బోర్డు అధిపతి, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, హెల్త్‌కేర్ కోర్సు కోఆర్డినేటర్, చైర్మన్ బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో ఉద్యోగ విరమణ పొందారు.

పెండింగ్ కేసులు పరిష్కారం కావాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషనర్ చైర్మన్ వెంకటయ్య



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

జనగామ రూరల్: జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన పెండింగ్ కేసులు త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ల్యాండ్, అట్రాసిటీ సమస్యలపై ఎస్సీ సంక్షేమ, ఎస్సీ కార్పొరేషన్, రెవెన్యూ, పోలీస్, ట్రైబల్ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి పెండింగ్ కేసులు లేకుండా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ నిర్దేశిత సమయంలో విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీ సమస్యలను చర్చించి వాటి పరిష్కారం దిశగా వివిధ శాఖల అధికారులు కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్, లక్ష్మీ నారాయణ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి విక్రమ్, ఎస్సీ కార్పొరేషన్ మాధవిలత, ప్రేమకళ, ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపుతో జీవన ప్రమాణం పెంపు

- డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రవీందర్

జనగామ: కేన్సర్, పక్షవాతం, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే వారిని ఆత్మీయంగా పలకరిస్తూ.. జీవన ప్రమాణాలు పెంచే విధంగా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. పాలియేటివ్ కేర్ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధీర్‌తో కలిసి డీఎంహెచ్ఓ మాట్లాడారు. పాలియేటివ్ కేంద్రంలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అంతకు ముందు వైద్య సేవలు పొందుతున్న పేషెంట్లతో మాట్లాడి, పాలియేటివ్ కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారికి పండ్లు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో డాక్టర్లు అనురాధ, లక్ష్మీనారాయణ, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

గ్రూప్స్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

- వీసీలో తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన అదనపు కలెక్టర్, అధికారులు

జనగామ: వచ్చే నెలలో జరుగనున్న గ్రూప్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రూప్స్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. వీసీలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, ఏసీపీ పార్థసారథితో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. టీజీపీఎస్ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ వచ్చే నెల నవంబర్ 17, 18న గ్రూప్-3, డిసెంబర్ 15, 16 తేదీల్లో గ్రూప్-2 పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటు రాకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల ధ్రువీకరణ పూర్తయిన వెంటనే అభ్యర్థుల వివరాలతో కూడిన ఓఎంఆర్ షీట్ల ముద్రణ ప్రారంభించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షకు 5,616 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. ప్రశ్నపత్రాలను భద్ర పరిచేందుకు కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

చదువుతో పాటు కళల్లోనూ రాణించాలి

విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డు ఏకశిల బీఈడీ కళాశాలలో శుక్రవారం జిల్లాస్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమాన్ని డీఈఓ రామ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి ప్రోగ్రాంలో పాల్గొని, తనలోని ప్రతిభను చాటుకుంటూ పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మరింత పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాఉత్సవ్ జిల్లా కో ఆర్డి నేటర్ బి.శ్రీనివాస్, డీసీఈబీ కార్యదర్శి చంద్ర భాను, న్యాయ నిర్ణేతలు మల్లి కార్జున్, వీరంజని, డీసీఈబీ సహాయ కార్యదర్శి, రామరాజు తదితరులు ఉన్నారు.

విజేతలు వీరే

కళా ఉత్సవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారు జి.నిషిత (సాక్రెడ్ హార్ట్స్ స్కూల్, రఘునాథపల్లి), ఎస్ .వైష్ణవి (ప్రభుత్వ ఉన్నత వావిలాల), జె.యోగామృత, టి.జ్ఞానమేరీ, బి.అంజలి, ఎస్.మణికృతి, ఎం.అక్షయ,(సెయింట్ అల్ఫోర్స్ స్కూల్) టి. సంజన (గురుకుల పాఠశాల, కొడకండ్ల), కె.నిషిత (ప్రభుత్వ ఉన్నత పాఠశాల/తరిగొప్పుల), సిహెచ్ .అలేఖ్య (ప్రభుత్వ ఉన్నత పాఠశాల/ చీటూరు)లను అధికారులు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగులో నంబర్ వన్‌గా ఉండాలి

ఆయిల్ పామ్ సాగులో జిల్లా మొదటి స్థానంలో ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. మూడు నెలల కాలంలో జిల్లాలో 300 వందల ఎకరాలకు పైగా సాగు పెరగగా ఇంకా పురోగతి సాధించాలన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణుల నమోదు, వైద్యం పనితీరు, ఆశల సేవలపై డీఎంహెచ్ఓ ప్రతీ రోజు పరిశీలన చేయాలన్నారు. ఈ సమీక్షలో డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ ఆర్.సుధీర్, శ్రీధర్, డీఐఓ డాక్టర్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ బ్యాడ్మింటన్ కోచ్‌గా రమేశ్


కూరపాటి రమేశ్

వరంగల్ స్పోర్ట్స్: చెన్నైలో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించే యోనెక్స్ సన్‌రైజ్ జాతీయ స్థాయి సబ్‌జూనియర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టు కోచ్‌గా హనుమకొండ డీఎస్‌ఏ కోచ్ కూరపాటి రమేశ్ ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లెల గోపిచంద్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేశ్‌ను బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ రమేశ్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ రమేశ్‌కుమార్, కోశాధికారి నాగకిషన్, డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-14,17 బాలుర రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రూనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని తెలిపారు.

'ఎస్‌జీఎఫ్' క్రీడాపోటీల షెడ్యూల్ విడుదల

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించనున్న అండర్-19 ఎస్‌జీఎఫ్ బాలబాలికల క్రీడా పోటీల వివరాలను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ శుక్రవారం ప్రకటించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 25వ తేదీన మొదటి విడతలో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాల్‌బ్యాడ్మింటన్, నెట్‌బాల్, కరాటే, లాన్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, సాఫ్ట్‌బాల్, క్రికెట్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26వ తేదీన ఖోఖో, తైక్వాండో, బాక్సింగ్, చెస్, జిమ్నాస్టిక్స్, హాకీ, వెయిట్ లిఫ్టింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్ , జూడోను వరంగల్‌లోని ఓసిటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, లేటెస్ట్ బోనోఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో జిరాక్స్ ప్రతులపై కళాశాల ప్రిన్సిపల్ సతంకం చేసుకుని ఉదయం 8గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని తెలిపారు. వివరాలకు 98492 10746, 9963336559, 80084699219 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.



వీసీలు.. మనోళ్లే



కొంతకాలంగా ఇన్‌చార్జ్‌ల పాలనలో కొనసాగుతున్న రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి స్థాయి వైస్ చాన్స్‌లర్లను నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఇద్దరు ఉమ్మడి వరంగల్‌కు చెందిన వారికి వీసీ పదవులు లభించాయి. నల్లగొండ జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన ఖాజా అల్తాఫ్ హుస్సేన్, నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీకి వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లికి చెందిన యాదగిరిరావు వీసీలుగా నియమితులయ్యారు. వీరి నియామకంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంజీ వర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్‌కు రెండోసారి అవకాశం

కేయూ క్యాంపస్: నల్లగొండ జిల్లాలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీగా కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యుడు ఖాజా అల్తాఫ్ హుస్సేన్ నియమితులయ్యారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీకి మరోసారి వీసీగా నియమితులు కావడం విశేషం. హనుమకొండ జిల్లా కాజీపేటకు చెందిన అల్తాఫ్‌హుస్సేన్1986లో కాకతీయ యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. 1994లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2004లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత కూడా. కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, రెండుసార్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి, ఐక్యూఏసీ డైరెక్టర్ బాధ్యతలు నిర్వర్తించారు. పలువురు పరిశోధకులు అయన వద్ద పీహెచ్‌డీ పూర్తిచేశారు

మహాత్మాగాంధీ వర్సిటీకి మరోసారి వీసీగా..



ఖాజా అల్తాఫ్‌హుస్సేన్, వీసీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ

మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీగా ప్రొఫెసర్ అల్తాఫ్‌హుస్సేన్‌కు మరోసారి అవకాశం లభించింది. గతంలో 2016 జూన్30న యూనివర్సిటీ వీసీగా నియమితులై 2019 జూన్ 29వరకు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ప్రొఫెసర్‌గా సర్వీస్ ఉండడంతో కాకతీయ యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో మరో ఆరునెలలపాటు ఆచార్యుడిగా కొనసాగారు. 2019 డిసెంబర్‌లో ఉద్యోగ విరమణ పొందారు. కాగా, మహాత్మాగాంధీయూనివర్సిటీకి మరోసారి వీసీగా అవకాశం రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తాను వీసీగా గత టర్మ్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని, అకడమిక్ పరంగా కూడా నాణ్యమైన విద్యనందించేలా కృషిచేశానన్నారు. ఆ యూనివర్సిటీకే వీసీగా రెండో సారి అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.

టీయూ వీసీగా యాదగిరిరావు..

నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆచార్యుడు టి.యాదగిరిరావు నియమితులయ్యారు. టి.యాదగిరిరావు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లికి చెందిన వారు. హనుమకొండలోని సుబేదారి టీచర్స్ కాలనీలో స్థిరపడ్డారు. కేయూలో ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో 1988లో పీజీ పూర్తిచేశారు. 1991లో కేయూ ఎస్‌డీఎల్‌సీఈలో కోర్సుకో ఆర్డినేటర్ విధులు నిర్వర్తించారు. 2007లో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆతరువాత 2009లో అసోసియేట్ ప్రొఫెసర్, 2011ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. 28 సంవత్సరాల బోధన, పరిశోధన అనుభవం కలిగి ఉన్నారు. యాదగిరిరావు పర్యవేక్షణలో 22 మంది పీహెచ్‌డీలు, 9 మంది ఎంఫిల్ పట్టాలు పొందారు. 17 పబ్లికేషన్స్ ఉన్నాయి. పబ్లిక్‌అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఆర్‌ఎం విభాగం అధిపతి, బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్, కేయూ యూజీసీ కోఆర్డినేటర్ బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ యూనివర్సిటీలో సోషల్‌సైన్స్‌డీన్ బాధ్యతలు కూడా నిర్వర్తించారు. 2021లో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు కూడా పొందారు.

నాణ్యమైన విద్య అందేలా చర్యలు



తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటా. అకడమిక్ పరంగా వర్సిటీలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాల్సి ఉంది. ఇదే యూనివర్సిటీలో సోషల్ సైన్స్‌డీన్‌గా బాధ్యతలు నిర్వర్తించా. యూనివర్సిటీలోని పలు సమస్యలపై అవగాహన ఉంది. వీటిని పరిష్కరించి వర్సిటీ అభివృద్ధికి కృషిచేస్తా.

-ప్రొఫెసర్ యాదగిరిరావు, వీసీ, టీయూ

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి..

చైన్ స్నాచింగ్

- అంతర్ జిల్లా చైన్ స్నాచర్ అరెస్ట్
- రూ.14.63 లక్షల విలువైన 20.9 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి.. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన అంతర్ జిల్లా చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసి 11 చోరీలకు సంబంధించిన రూ.14.63 లక్షల విలువైన 20.9 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కొంత కాలంగా వరుస చైన్ స్నాచింగ్ ఘటనల నేపథ్యంలో అడిషనల్ ఎస్పీ చెన్నయ్య పర్యవేక్షణలో డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో మహబూబాబాద్ టౌన్, సీసీఎస్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని ఆర్తి గార్డెన్ దగ్గర ఓ వ్యక్తి బైక్ అనుమానాస్పదంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించగా పట్టుకుని విచారించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో డ్రిల్లింగ్ మిషన్ వర్క్ చేసే ఆంగోతు విక్రమ్‌గా గుర్తించారు. విక్రమ్ డిగ్రీ చదువుతున్న సమయంలో ఆన్ లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకుని అప్పులపాలయ్యాడు. ఆ డబ్బు ఎలా సంపాదించాలని సామాజిక మాధ్యమాల్లో చైన్ స్నాచింగ్ సన్నివేశాలు చూసేవాడు. తను కూడా చైన్ స్నాచింగ్ చేసి అప్పులు తీర్చి తిరిగి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పాల్గొనాలని ప్లాన్ చేసుకున్నాడు. దీంతో గత సంవత్సరం నుంచి బైక్‌పై ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలో తిరుగుతూ మహిళల మెడలలో ఉన్న బంగారు ఆభరణాలను లాక్కొని వెళ్లేవాడు. మహబూబాబాద్ కృష్ణ కాలనీలో ఒకటి, బ్యాంకు కాలనీలో రెండు, కంకర బోడు ప్రాంతంలో ఒకటి చొప్పున మొత్తం 4, ఖమ్మం టౌన్ పరిధిలో 7 చోరీలకు పాల్పడ్డాడు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను అమ్మాలని ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కాగా, నేరస్తుడిని పట్టుకున్న మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్, సీసీఎస్ సీఐ హథిరాం, సీసీఎస్ ఎస్సైలు తాహెర్ బాబా, బైరు గోపి, లింగయ్య, టౌన్ ఎస్సై విజయ్ కుమార్, సిబ్బందికి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రివార్డులు అందజేసి అభినందించారు.

మోటార్ ఆన్ చేయడానికి వెళ్తూ..

- విద్యుదాఘాతంతో రైతు మృతి


కుమారస్వామి (ఫైల్)

పర్వతగిరి : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బాల్య కుమారస్వామి(42) సమీపంలోని తన వ్యవసాయ పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఆన్ చేయడానికి వెళ్లే క్రమంలో బోరువద్ద వైరు ఊడి ఉంది. గమనించని కుమారస్వామి వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. కుమారస్వామి అన్న గతంలో రోడ్డు ప్రమాదంలో, కుమారస్వామి విద్యుదాఘాతంతో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోనగిరి దురేశ్, దండంపల్లి సైదులు, కారుపోతుల శ్రీనివాస్, మాసాడి రాజేశ్వరరావు, మార్నేని విజయరావు, రాజు, యాకయ్య, సంపత్‌లు పరామర్శించి సంతాపం తెలిపారు.

కొడుకు జన్మదినం రోజే తండ్రి మృతి...

విద్యుదాఘాతంతో మృతి చెందిన కుమారస్వామికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, శుక్రవారం కుమారుడి 6వ జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. తండ్రి విద్యుదాఘాతంతో మృతి చెందగా కుమారుడు సుశాంత్ జన్మదిన వేడుకలు నిలిచిపోయాయి.

దేశం గర్వపడేలా విజయాలు సాధించాలి

- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- గవర్నర్‌ను కలిసిన మౌంటైనర్ యశ్వంత్


తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మౌంటైనర్ యశ్వంత్

మరిపెడ రూరల్: ప్రపంచ వేదికపై భారతదేశం గర్వపడేలా గొప్ప విజయాలు సాధించాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ రాష్ట్ర గవర్నర్‌ను హైదరాబాద్ రాజ్ భవన్‌లో గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపాడు. అనంతరం గవర్నర్ యశ్వంత్ విజయాలను ప్రశంసిస్తూ వెల్ డన్ మై బోయ్ అని అభినందించాడు. అరుణాచల్ ప్రదేశ్‌లోని 'గోరిచెన్' పర్వతాన్ని అధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా విజయం సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ కీర్తి తెలంగాణ రాష్ట్రం, యావత్ భారత్ దేశానిదిగా చెప్పవచ్చునని పేర్కొన్నారు. భవిష్యత్‌లో గొప్ప విజయాలు సాధించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని యశ్వంత్‌ను గవర్నర్ ఆశీర్వదించారు.

మాజీ డిప్యూటీ మేయర్ రవీందర్ కన్నుమూత

- పార్థివదేహాన్ని సందర్శించిన కేంద్ర ఖాదీ ఇండస్ట్రియల్ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం, ఎమ్మెల్సీ సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- సంతాపం తెలిపిన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క


రవీందర్ (ఫైల్)


రవీందర్ పార్థివదేహాన్ని సందర్శిస్తున్న ఈగ మల్లేశం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం పెరకవాడకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వరంగల్ మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ కన్నుమూశారు. కొద్ది రోజుల క్రితం గుండె సమస్య తలెత్తడంతో వైద్యులు స్టాంట్ వేయగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆరోగ్యం మెరుగుపడిందనుకునే సమయంలో మళ్లీ పరిస్థితి విషమించింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. రవీందర్‌కు భార్య అరుణ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ పెరకవాడలోని ఆయన నివాసానికి రవీందర్ పార్థివదేహాన్ని తరలించారు.

వ్యాపారి నుంచి రాజకీయవేత్తగా..

వరంగల్ పెరకవాడకు చెందిన ఎంబాడి అమర్‌నాథ్, లక్ష్మీ దంపతులకు ఇద్దరు కుమారులు రవీందర్, నాగేశ్వరరావు, కుమార్తె కరుణ ఉన్నారు. ఈ దంపతుల రెండో సంతానంగా రవీందర్ 1962 డిసెంబర్ 13న జన్మించారు. రాజకీయ నాయకుడిగా, నగరంలో ప్రముఖ ఐరన్, సిమెంట్ వ్యాపారవేత్తగా ఎదిగారు. మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యకు ప్రధాన అనుచరుడిగా పనిచేశారు. వీరు ఇద్దరు కాంగ్రెస్ పార్టీ వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి ప్రధాన శిష్యులుగా ఎదిగారు. సారయ్య సహకారంతో మూడు సార్లు కార్పొరేటర్‌గా, ఐదేళ్ల పాటు డిప్యూటీ మేయర్‌గా పనిచేసి పేదల మన్ననలు పొందారు.

తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర..

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న తరుణంలో కాంగ్రెస్‌లో పనిచేస్తూ.. ఉద్యమానికి ఊపిరి నిచ్చాడు. నేను ఉన్నానంటూ కార్యకర్తలతో తరలివచ్చాడు.రహదారులపై వంట, వార్పు కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యాడు.సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్య నింపాడు.

పలువురి సంతాపం..

నగర మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ మృతిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, సీతక్క సంతాపం తెలిపారు. రవీందర్ పార్థివ దేహాన్ని కేంద్ర ఖాదీ ఇండస్ట్రీయల్ బోర్డు మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, పార్టీ రాష్ట్ర నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, మాజీ ఎమ్మెల్యే శ్రీరాంభద్రయ్య, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జాక్ కన్వీనర్ దిడ్డి నరేందర్, డాక్టర్ హరిరమాదేవి, రాజనాల శ్రీహరి, నగర తాజా,మాజీ కార్పొరేటర్లు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఆర్‌ఆర్ తోటలోని హిందూ శ్మశాన వాటికలో రవీందర్ అంత్యక్రియలు నిర్వహించారు.






నూతన కోర్సులపై దృష్టి పెడితేనే భవిష్యత్

- ఆర్‌డీడీ సీతారాములు


మాట్లాడుతున్న ఆర్‌డీడీ సీతారాములు

ఏటూరునాగారం : ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యువత నూతన సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెడితేనే భవిష్యత్ ఉంటుందని ఆర్‌డీడీ సీతారాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఐటీడీఏ, ఐటీఐ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రవేశాల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్‌డీడీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా చొరవతో ఏటూరునాగారం ఐటీఐకి ఏటీసీ మంజూరైందన్నారు. ఈ సెంటర్‌లో 6 నూతన కోర్సులను ప్రవేశపెట్టి 172 మందికి శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగానే ఎంపికలు ప్రారంభించామన్నారు. వంద మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. పదో తరగతి పూర్తి చేసిన వారికి ఈ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తామన్నారు. గిరిజన బాలబాలికలకు ఇది గొప్ప సదావకాశం అన్నారు. కార్యక్రమంలో డీడీ పోచం, ఎస్‌ఓ రాజ్‌కుమార్, వివిధ మండలాల ఐటీఐ ప్రిన్సిపాళ్లు శేఖర్, వెంకటేశ్వరరావు, జగన్‌మోహన్‌రెడ్డి, సీడీపీఓ ప్రేమలత, జేడీఎం కొండల్‌రావు, జేఆర్‌పీలు భిక్షపతి, పాపారావు, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని కూలీ మృతి


తిరుపతమ్మ(ఫైల్)

కాశిబుగ్గ : రైలు ఢీకొని ఓ కూలీ మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం నెక్కొండ, ఎల్గూరు రైల్వేస్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ పి. సురేందర్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గేటుపల్లి గొల్లపల్లికి చెందిన తిరుపతమ్మ(50) పత్తి తీసేందుకు పట్టాలు దాటుతోంది. ఈక్రమంలో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రాజు కేసునమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతురాలి భర్త గురువయ్యకు అప్పగించామని సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..


గట్టయ్య(ఫైల్)

మల్హర్: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మల్హర్ మండలం మల్లారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గట్టయ్య (50) తన వ్యవసాయ పొలాన్ని జంతువుల నుంచి రక్షించుకోవడానికి కరెంట్ తీగలతో కంచె ఏర్పాటు చేశాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన గట్టయ్యకు తీగలు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై భార్య ఓదక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై వడ్లకొండ నరేశ్ పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్య


శైలజ(ఫైల్)

ఏటూరునాగారం: ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఏటూరునాగారంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన గణపారపు నాగేశ్వరరావు, శారద దంపతుల కూతురు శైలజ(21) డిగ్రీ మధ్యలో మానేసి ఇంటి వద్దే ఉంటుంది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, శైలజ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్, రైల్వే, ఎస్ఎస్‌సీ, గ్రూప్స్, పోలీసులు ఇతర పరీక్షల్లో శిక్షణ ఉంటుందన్నారు. అందుకోసం ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు Studycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8374417424, 9441003400 నంబర్లను సంప్రదించాలన్నారు.

సబ్ జైలును సందర్శించిన జైళ్ల శాఖ డీఐజీ


జైళ్ల శాఖ డీఐజీని సన్మానిస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ సబ్ జైలును తెలంగాణ జైళ్ల శాఖ డీఐజీ మాదారపు సంపత్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అధికారి విజయ్ డేనీ..జైళ్ల శాఖ డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం సంపత్ కుమార్ జైలు కలియ తిరిగి ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను జైలర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. జైలులోని పరిశుభ్రత, ఖైదీల సంక్షేమంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సబ్ జైలు అధికారులు డీఐజీని సన్మానించారు. జైలు ఉన్నతాధికారులు పట్టెం భిక్షపతి, సిటిజన్ ఫోరం సభ్యులు శంతన్ రామరాజు, సదానిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన భూత వైద్యం

- అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడిని ఆలయం వద్దకు తీసుకొచ్చిన తల్లి
- పరిస్థితి విషమించి అక్కడికక్కడే మృతి


రాములు మృతదేహం

బయ్యారం : అనేక రకాల వ్యాధులకు వైద్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ ఇంకా మూఢనమ్మకాలతో ప్రజలు కొట్టుమిట్టులాడుతూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడిని ఆలయం వద్దకు బాగు చేసేందుకు తీసుకురావడంతో పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని గంధంపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లికి చెందిన కుడికంటి రాములు(29) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతడిని గంధంపల్లిలోని ఓ ఆలయం వద్ద ఉన్న పూజారికి చూపిస్తే బాగుపడుతాడనే నమ్మకంతో తల్లి సావిత్రి రాములును తీసుకొని ఆలయం వద్దకు వచ్చింది. ఆలయం వద్దకు వచ్చిన తర్వాత రాములు పరిస్థితి విషమించి అస్వస్థతకు గురికావడంతో పూజారి బయటకు పంపించాడు. ఆలయానికి కొద్ది దూరంలోనే రాములు మృతి చెందాడు. తర్వాత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు

పేద కుటుంబానికి చెందిన రాములు తండ్రి భిక్షం గీత కార్మిక వృత్తిని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. భిక్షం 20 ఏళ్ల క్రితం తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. దీంతో తల్లి సావిత్రి రెక్కలకష్టంతో రాములుతో పాటు సోదరిని పెంచి పెద్ద చేసింది. సోదరికి పెళ్లి చేయగా రాములుకు వివాహం చేద్దామని భావిస్తున్న సమయంలో మృతి చెందాడు.

పదేళ్ల బాలుడిపై కుక్కల దాడి


కుక్కల దాడిలో గాయపడిన మణిదీప్

జనగామ: జనగామ పట్టణం కురుమవాడ హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఓ బాలుడిపై ఐదు కుక్కలు విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన శుక్రవారం జరిగింది. కురుమవాడకు చెందిన మామిడాల సాగర్ కుమారుడు మణిదీప్(10) నాలుగో తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడు నానమ్మ ఇంటికి వెళ్లాడు. తిరిగి తమ వెళ్తున్న క్రమంలో కుక్కలు దాడి చేశాయి. స్థానికులు స్పందించే లోపే తీవ్రంగా గాయపర్చగా కుటుంబ సభ్యులు వచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించారు. ఈ ఘటనతో కాలనీ వాసులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. పట్టణంలో వారం రోజులుగా కుక్కలు స్వైర విహారం చేస్తూ రోడ్డు వెంట వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

పిడుగుపాటుతో మహిళా రైతు మృతి


వెంకాయమ్మ మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం అందనాలపాడు గ్రామానికి చెందిన మహిళా రైతు పిడుగుపాటుతో మృతి చెందింది. అందనాలపాడుకు చెందిన పోతుగంటి బాబు, వెంకాయమ్మ(45) దంపతులు తమ వ్యవసాయ భూమిలో మిరప పంట సాగు చేస్తున్నారు. శుక్రవారం వెంకాయమ్మ మిరపతోటలో పని చేస్తుండగా అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ క్రమంలో వెంకాయమ్మ సమీపంలో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు ఆమె మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. మృతురాలికి భర్త, కుమార్తె ఉన్నారు.